న్యాయం కోసం దీక్షలు చేస్తున్నా పట్టించుకోరా?

- కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి విన్నవించిన ప్రజాసంఘాలు, బాధితుడి భార్య
- సీఎండీ దృష్టికి తీసుకెళ్లి సాగర్‌బాబుకు న్యాయం చేయాలని సూచించిన కలెక్టర్



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, బాధితుడి భార్య

నరసరావుపేట: న్యాయం కావాలని బాధితుడు సాగర్‌బాబు గత 24రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటం శోచనీయమని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. విద్యుత్ అధికారుల వలన జీవితాన్నే కోల్పోయిన దళిత యువకుడు సాగర్‌బాబుకు మద్దతుగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి న్యాయం చేయాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. ఈసందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ కారంపూడి మండలం పెద కొదమగుండ్ల గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ఏఈ కోటేశ్వరరావు, లైన్ ఇనస్పెక్టర్ ఓంకార్, లైన్‌మెన్ ఎం.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్ పరబ్రహ్మాచారి కరెంటు తీయకుండా తీశామని చెప్పి సాగర్‌బాబును విద్యుత్ స్తంభం ఎక్కించి వికలాంగుడిగా మార్చి మంచానికి పరిమితం చేశారన్నారు. నడుము, కాళ్లుచేతులు పడిపోయిన సాగర్ బాబు తన భార్య గ్రామమైన చేజర్లలో న్యాయం కోసం నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నాడన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సాగర్‌బాబుకు వెంటనే న్యాయం చేయాలని విద్యుత్ శాఖ సీఎండీ దృష్టికి తీసుకెళ్లాలని ఆ శాఖ అధికారులకు తెలియజేశారు. దీనిపై తాము ఇప్పటికే సీఎండీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారన్నారు. సీఎండీకి పంపిన నివేదికను తమకు ఇవ్వాలని కోరినా వారు ఇవ్వట్లేదని నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ నివేదికను వెంటనే వారికి ఇచ్చి సమస్య పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆదేశించారని నాయకులు వెల్లడించారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు రవినాయక్, ప్రజా కళా మండలి రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఉన్నం రాణి, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, సాగర్ బాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు విన్నవించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన వెంకటాయపాలెం గ్రామస్తులు

మా భూములను 22–ఏ కింద మినహాయించండి

నరసరావుపేట: తమ గ్రామంలో సుమారు 1938 నుంచి తాము సాగుచేస్తున్న భూములను 22–ఏ కింద మినహాయించి తమ జీవితాలను కాపాడాలని బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను కోరారు. గ్రామానికి చెందిన సుమారు 50మంది గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో తమకు జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చేందుకు వచ్చారు. ఈసందర్భంగా గ్రామస్తులు టీజే శ్రీనునాయక్, జె.హనుమంతరావు వివరాలు తెలియచేస్తూ గ్రామంలో గయాలు జాబితాలో 1938 నుంచి ఉన్న భూములు 1943–44లో రైతుల పేర్లుకూడా నమోదు చేయటం జరిగిందన్నారు. వీటిలోని 53 ఎకరాలను 1977లో రైతులకు డీకే పట్టాలు ఇచ్చిందన్నారు. ఆ భూములను ఇటీవల ప్రభుత్వం 22.ఏ జాబితా కింద చేర్చటంతో క్రయవిక్రయాలు నిల్చిపోయాయని చెప్పారు. తమలో చాలా మంది వృద్ధాప్యంతో, అనేక జబ్బులతో ఇబ్బందులు పడుతున్నామని, అందువలన తమ భూములను 22–ఏ కింద తప్పించి తమకు న్యాయం చేయాలని కోరారు. బి.బలరామ్‌నాయక్, బి.నాగునాయక్, బి.కోటేశ్వరరావునాయక్, జి.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి బెదిరింపులకు బెదరం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్
- ఆరోపణలకు సమాధానాలు ఇవ్వకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటు
- కూటమి అక్రమాలు బయటపెట్టేందుకు ప్రాణాలకైనా తెగిస్తా



మాట్లాడుతున్న ఎం.ఎన్.ప్రసాద్

వినుకొండ : కూటమి ప్రభుత్వం బెదిరింపులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎవరూ భయపడరని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి, రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శి పగడాల వెంకట రామిరెడ్డిలతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వినుకొండ టీడీపీ అనుబంధ సంఘం నాయకులు, కొందరు న్యాయవాదులు వైఎస్సార్ సీపీ నేతలపై చేసిన వ్యక్తిగత విమర్శలు, దూషణలు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అధికార పార్టీ నాయకులు గ్రామచెరువులను, సొసైటీ చెరువులను ఆదాయ వనరులుగా మార్చుకొని కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆరోపణలకు సరైన సమాధానాలు ఇవ్వకుండా వ్యక్తిగత దూషణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మీరు ఎంత బెదిరించినా ఇక్కడ బెదిరేవారు ఎవరూ లేరని సమాధానం ఇచ్చారు. వినుకొండలోని ఏబీఎం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గత ప్రభుత్వంలో చర్యలు చేపట్టామని, కొందరు టీడీపీ నాయకులు వివాదాస్పద భూములను కొనుగోలు చేస్తూ అమ్మకాలు సాగిస్తూ తమపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. గ్రామాల్లో కూటమి ప్రభుత్వం ఆగడాలు పెరిగిపోవడంతోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఏర్పాటు చేసి కార్యకర్తలకు భరోసా ఇచ్చారని, తనను చంపాలని చూస్తే తన అంతిమయాత్రలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని, ప్రాణాలకు తెగించి అయినా సరే టీడీపీ చేస్తున్న అక్రమాలను వెలుగులోకి తెస్తామన్నారు. రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండలో రషీద్ హత్య దగ్గరి నుంచి అనేక హత్యలు జరిగాయని, అక్రమ బెల్టుషాపులు, గంజాయి, భూకబ్జాలు, ఇసుక, రేషన్ అక్రమ బియ్యం వంటి కార్యకలాపాలు పెరిగిపోయాయని, ప్రశ్నించే వారిపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడం వంటి చర్యలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరో వైపు విద్య, వైద్యం, వ్యవ సాయం వంటి రంగాల్లో అభివృద్ధి చేసి చూపించారని, 90 ఏళ్ల చరిత్రలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేని ప్రభుత్వం ఆరోపణలకు సమాధానం చెప్పలేక దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, మండల కన్వీనర్లు కొండవర్జు నాగేశ్వరరావు, ముప్పరాజు వెంకటేశ్వర్లు, మండల నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండలంలోని తూబాడు, గొరిజవోలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏడీఈ అశోక్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూరల్ సీఐగా బ్రహ్మయ్య



వినుకొండ: రూరల్ సీఐగా బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రూరల్‌సీఐగా పనిచేస్తున్న ప్రభాకర్ బదిలీ కాగా ఆయన స్థానంలో బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన సీఐను ఐనవోలు, శావల్యాపురం, ఎస్ఐలు కృష్ణారావు, లోకేశ్వరరావు, సర్కిల్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో వినుకొండ విద్యార్థిని ప్రతిభ



వినుకొండ : పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినీ బండారు రవళి జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు పాఠశాల హెచ్ఎం బి.శైలజ కుమారి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవళి సెప్టెంబరు 25 నుంచి 28వ తేదీ వరకు తమిళనాడులో జరిగిన జాతీయ పోటీల్లో తృతీయ స్థానం సాధించినట్లు వివరించారు. పాఠశాల ఆవరణలో రవళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.రూత్‌మేరి, కె.రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు భువనేశ్వరి, సీహెచ్. చంద్రశేఖర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయరూ...

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావును కోరారు. పాఠశాలకు వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి స్కూలు వరకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షం కురిస్తే బురదమయంగా మారి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు బురద కారణంగా యూనిఫాం పాడవుతోందని, కొన్ని సందర్భాల్లో బురదలో జారి పడిన సందర్భాలున్నాయని వాపోయారు. అర్జీ అందించిన వారిలో ఎస్సీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వీరయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ సంక్రాంతికి వస్తాం...

– కిక్కిరిసిన చిలకలూరిపేట ఆర్టీసీడిపో



చిలకలూరిపేటటౌన్: దసరా పండుగ సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణం అయ్యే ప్రయాణికులు, విద్యార్థులతో చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్ ఆది, సోమ రెండు రోజులు కిక్కిరిసిపోయింది. బస్టాండ్‌లో ఎటు చూసినా ప్రయాణికుల రద్దీ, బస్సులు, బ్యాగులతో సందడి వాతావరణం కనిపించింది. దసరా సెలవుల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిన వారు తిరిగి తమ గమ్యస్థానాలకు పయనమయ్యారు. ముఖ్యంగా పాఠశాలలు ఇప్పటికే ఈ నెల 3వ తేదీ నుంచే ప్రారంభమైనప్పటికీ, సుదూర ప్రాంతాల్లోని వసతి గృహాలలో ఉంటూ చదువుకునే విద్యార్థులు అధిక సంఖ్యలో సోమవారం తమ బడులకు చేరేందుకు బయలుదేరారు. దీంతో బస్టాండ్ ప్రాంగణమంతా ప్రయాణికులతో, బస్సుల కోసం ఎదురుచూసే వారి బారులు తీరిన దృశ్యాలతో నిండిపోయింది. సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో ఉండడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీతో కిటకిటలాడింది.

తల్లివద్ద అదృశ్యమై తండ్రి వద్ద ప్రత్యక్షమైన బాలుడు

యద్దనపూడి: దసరా పర్వదినం సందర్భంగా స్వగ్రామం వెళ్లి సెలవుల అనంతరం తిరిగి పాఠశాలలో చేరేందుకు వచ్చిన విద్యార్థి అదృశ్యం అయ్యాడు. దీంతో బాలుడి తల్లి, పాఠశాల ఉపాధ్యాయులు, చివరకు పోలీసులు అలర్ట్ అయ్యారు. చివరకు తల్లికి చెప్పకుండా వెళ్లి అదృశ్యమైన ఆ బాలుడు తండ్రి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. యద్దనపూడి మండలంలోని ఓ పాఠశాలలో ఏడో తరగతి చదివే బాపట్ల విద్యార్థి దసరా సెలవులకు వెళ్లి తిరిగి పాఠశాలలో చేరేందుకు తల్లితో పాటు వచ్చాడు. ఇద్దరు బోయపాలెం గ్రామంలోని ఓ సూపర్ మార్కెట్‌లో సబ్బులు, వాటర్ బాటిల్ కొనుగోలుకు వెళ్లారు. ఇంతలో వాష్‌రూమ్‌కని చెప్పి బయటకు వెళ్లిన కుమారుడు ఎంతకూ రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి పాఠశాలకు వెళ్లి చెప్పింది. వెంటనే ఉపాధ్యాయులు, పోలీసులకు సమాచారం అందించి వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో అదృశ్యమైన బాలుడు తన తండ్రి వద్దకు వెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బాలుడు క్షేమంగా ఉన్నట్లు తెలియడంతో పోలీసులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నట్లు సమాచారం.

అగ్రహారం భూముల రైతులకు పట్టాలు, పాస్‌పుస్తకాలు ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నూజెండ్ల: ఏళ్ళ తరబడి సాగు చేసుకుంటున్న అగ్రహారం భూములు రైతులకు పట్టాలు మంజూరు చేసి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు రైతులతో కలిసి తహసీల్దార్ రమేష్ కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ మండలంలోని అప్పాపురం, తిమ్మాపురం, కొండ్రప్రోలు గ్రామాల్లో సుమారు 6 వేల ఎకరాల్లో ఉన్న అగ్రహారం భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినప్పటికీ రైతులకు న్యాయం జరగటం లేదన్నారు. అగ్రహారం భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాల్సిన అవసరం ఉందన్నారు. భూముల సమస్య పరిష్కారం కాకపోవటంతో రైతులకు అందాల్సిన పథకాలు, రాయితీలు కోల్పోతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు సైతం రైతులకు న్యాయం చేయటంలో చొరవ చూపటం లేదని విమర్శించారు. తహసీల్దార్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఇనాం సర్వీస్ భూములను సెటిల్‌మెంట్ చేస్తున్నామన్నారు. పనులు కొనసాగుతున్నాయని త్వరలో పట్టాలు పాస్‌పుస్తకాలు అందే ఏర్పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి హనుమంత్‌రెడ్డి, పాలడుగు ఆశీర్వాదం, అల్లూరిరెడ్డి, నాగార్జునరెడ్డి, అనుమోలు మల్లారెడ్డి, పొట్లపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ప్లేయర్స్ అవార్డుకు రొంపిచర్ల విద్యార్థులు



బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకుంటున్న జి. సాయి చైతన్య



బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకుంటున్న సి.హెచ్. అపర్ణ

రొంపిచర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్‌లో బెస్ట్ ప్లేయర్స్ అవార్డులు అందుకున్నారని ప్రధానోపాధ్యాయులు బీయం సుభానీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 తేదీ నుంచి అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలుర, బాలికల టీమ్‌లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పోటీల్లో పాల్గొన్న తమ స్కూల్ విద్యార్థులు జి.సాయిచైతన్య, సి.హెచ్. అపర్ణలు రాష్ట్ర బెస్ట్ ప్లేయర్స్ అవార్డులు అందుకున్నారన్నారు. జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలుర టీం ద్వితీయ స్థానం సంపాదించగా, బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ఆటలో ప్రతిభ కనపరిచి బెస్ట్ అవార్డుకు ఎంపికైన జి.సాయి చైతన్య, సి.హెచ్ అపర్ణలను పలువురు అభినందించారు. క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడా శిక్షణ ఇచ్చి అవార్డులు పొందేందుకు కారకుడైన వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్యను ప్రధానోపాధ్యాయులు బి.యం.సుభానీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ యిట్టి ఏడుకొండలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యేయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నరసరావుపేట: ఎస్సీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి (ఎమ్మార్పీఎస్ఎస్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు మీరయ్యమాదిగ మాట్లాడుతూ గతంలో ఎస్‌సీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్షకు రూ.50 వేలు సబ్సిడీపై రుణాలు ఇచ్చేవారన్నారు. బ్యాంకుల ద్వారా ఎస్‌సీలకు రుణాలు ఇప్పించాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ఉంటుందన్నారు.

ఇప్పటివరకు రుణాలు మంజూరుకాకపోవటం శోచనీయమని అన్నారు. రానున్న రోజుల్లో కార్పొరేషన్ తీసేసే ప్రమాదం ఎక్కువగా కన్పిస్తుందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఎస్‌సీ, ఎస్‌టీల సబ్సిడీ రుణాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనికి కలెక్టర్ స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారని మీరయ్యమాదిగ పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపోగు రమణరావు మాదిగ, కార్యకర్తలు శేషు, ఫ్లాంకిన్ పాల్గొన్నారు.



ఆగివెళ్తున్న ఆర్టీసీ బస్సులు

సాక్షి ఎఫెక్ట్

శావల్యాపురంలో ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయడం లేదంటూ సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై జిల్లా కలెక్టరు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఆర్టీసీ డిపో మేనేజరు జవ్వాజి నాగేశ్వరరావు స్పందించారు. వెంటనే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు పెరుమాళ్ళ వెంకటరావును శావల్యాపురం పంపించి వినుకొండ డిపో బస్సులు నిలుపుదల అయ్యేలా చేసి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. సాక్షి కథనానికి చర్యలు చేపట్టడంతో ప్రయాణికులు ధన్యవాదాలు తెలియజేశారు. డిపో మేనేజరు మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు.

–శావల్యాపురం

నేడు సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక మంగళవారం నిర్వహించనున్నట్లు ఎస్ఆర్పీ బి. ఉపాధి హామీ పథకం అవులయ్య తెలిపారు. 2024 ఏప్రియల్ 1 నుంచి మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకం, అటవీశాఖ, ఉద్యాన శాఖ, పంచాయతీరాజ్, పశుసంవర్ధక శాఖ, వెలుగు పథకంలో పెన్షన్లు 17వ విడత సామా జిక తనిఖీలు గ్రామాల్లో తనిఖీలు చేపట్టామని, గ్రామసభలు పూర్తి చేశామని తెలిపారు. 33 పంచాయతీల్లో 15.56 కోట్ల నిధులు తో చేసిన 771 పనులు చేపట్టారు. ఆయా పనులకు గాను మండలంలో 13 బందాలు సామాజిక తనిఖీలు పూర్తి చేశారు. ప్రధానంగా చెరువులు, కుంటలు, పంట కాలువలు కూడికతీత పనులు, ఉద్యాన పంటలు కు సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్‌లో లోపాలు ఉన్నట్లు గ్రామ సభల్లో బృందం డీఆర్పీలు వివరాల వెల్లడించారు. పనుల ప్రదేశంలో ఫోటోలు జతపరచడం తేడాలు, జాబ్ కార్డులు మంజూరు ఇష్టానుసారంగా జరిగిందని, కూలీల హాజరులో తేడాలు బహిరంగ ప్రజా వేదికలో వెల్లడి కానున్నాయి. వెల్లటూరు, రేమిడిచర్ల, మేళ్లవాగు, గుమ్మనంపాడు, కనుముల చెరువు, అయ్యన్నపాలెంపంచాయతీల్లో, గరికపాడు తదితర గ్రామ పంచాయతీల్లో వ్యత్యాసాలను,17వ విడత చేపట్టిన సామాజిక తనిఖీల్లో గుర్తించినట్లు తెలుస్తుంది.

నిరసన విజయవంతం చేయాలి



శావల్యాపురం: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్య పరిష్కరించటంలో ప్రభుత్వ వైఖరిని నిరసన తెలుపుతూ నేడు విజయవాడ ధర్నా చౌక్‌లో జరగనున్న నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని ఫ్యాక్టో నాయకులు సోమవారం పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నిరసనకు సంబదించిన కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎస్టీయూ నాయకులు బిళ్ళా రాజారమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలే సరైనా మార్గమన్నారు. పాఠశాల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు ఐక్యంగా నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఫ్యాక్టో నాయకులు కొండ్రముట్ల వెంకటరత్నం, సురేష్, గురుబాబు, బోసు ఉన్నారు.

వేగ నియంత్రణ అవసరమే!



శావల్యాపురం: మండల కేంద్రం జాతీయ రహదారి మార్గం ప్రధాన కూడలిలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వివరాల మేరకు గతంలో స్పీడు బ్రేకరు ఉండటం వలన వాహనచోదకులు వేగాన్ని తగ్గించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రాకపోకలు జరుగుతున్నాయి. ఇటీవల జాతీయ రహదారి మార్గంలో మరమ్మతులు చేస్తున్న సమయంలో రోడ్డు ఎత్తు పెంచటం వలన స్పీడు బ్రేకరు రోడ్డులో కలిసిపోయింది. దీంతో వాహనదారులు ఇష్టానుసారంగా అతి వేగంతో నడుపుతున్నారు. అంతేకాక ట్రాఫిక్ సంబదించి హెచ్చారిక బోర్డులు కూడా లేకపోవటం శోచనీయం. దీంతో పాటు వాహనాల రద్దీ పెరగటం వలన చిన్నారులు వృద్ధులు రోడ్డు దాటాలంటే భయానికి గురౌతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో స్కూల్ జోన్ వద్ద స్పీడు బ్రేకరు, గతంలో ఉన్న కనకదుర్గమ్మ దేవాలయం ఏరియాలో స్పీడు బ్రేకరు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండలస్థాయి ఆటల పోటీలు



సమావేశంలో హెచ్‌ఎం బి.శ్రీదేవి

నూజెండ్ల: ఈ నెల 8,9 తేదీల్లో మండలస్థాయి ఆటల పోటీలు నూజెండ్ల జెడ్పీ పాఠశాలలో జరపనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో మండలస్థాయి వ్యాయామోపాధ్యాయుల సమావేశం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి మాట్లాడుతూ అండర్ 14,17 విభాగాల్లో కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, షటిల్, అథ్లెటిక్స్‌లలో పోటీ లు నిర్వహించటం జరుగుతుందన్నారు. పాల్గొనదలచిన వారు అదే రోజు ఉదయం 9 గంటలకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు వెంకటరత్నం, బాజు, విజయ్, నరసింహరావు, వీరాంజనేయులు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

8 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8, 9 తేదీలలో పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయు లు బీయం సుభానీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు మండల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్, యోగ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 8వ తేదీన ఖోఖో, చెస్, వాలీబాల్, కబడ్డీ, యోగాలోనూ, 9వ తేదీన షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్య తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని వారు కోరారు.

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ టోర్నమెంటు పోటీలు ఈనెల8,9 తేదీల్లో జరుగుతాయని మండల స్కూల్ గేమ్స్ కోఆర్డినేటరు బి.అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్,యోగా, బాడ్మింటిన్,అథ్లెటిక్స్ అండర్-14, 17 విభాగాల్లో బాలురు,బాలికలకు విడి విడి పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు పోటీల్లో పాల్గొనవలసిందగా కోరారు. మండల స్థాయిలో ఎంపికైనా జట్టును డివిజన్ స్థాయికి పంపుతామన్నారు.

జీఎస్టీలో మార్పులు వినియోగదారులు గమనించాలి



బ్యూటీ పార్లర్లో తగ్గిన జీఎస్టీ టారిఫ్‌ను అందజేస్తున్న జేసీ, ఏసీలు

చిలకలూరిపేట: వినియోగదారులు జీఎస్టీలో వచ్చిన మార్పులను గుర్తించాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ చెప్పారు. పట్టణంలోని బ్యూటీపార్లర్లు, జిమ్ములు, సెలూన్లను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 22వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో మార్పులు తెచ్చిందని వివరించారు. రెండు స్లాబుల విధానాన్ని ప్రస్తుతం అమలు చేస్తు న్నారని వెల్లడించారు. జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతంకు తగ్గించటం జరిగిందని, ఈ విషయాన్ని గుర్తించి వినియోగదారులు చెల్లింపులు చేయాలని సూచించారు. దుకాణదారులు తగ్గించిన జీఎస్టీని అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ నిత్యానందం సిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

వినుకొండ : విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టర్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13వ తేదీన చలో విజయవాడ, 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని పల్నాడు జిల్లా కాంట్రాక్ట్ వర్కర్ల జేఏసీ నాయకులు పి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక విద్యుత్ స్టేషన్‌లో సోమవారం సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 2022 పీఆర్‌సీ ఒప్పందం ప్రకారం 17 నెలల ఏరియర్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాషా, భాస్కర్, బ్రహ్మయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదు.. యువకుడిపై కేసు

సత్తెనపల్లి: మహిళ ఫిర్యాదుతో యువకుడిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో సాయి కృష్ణ థియేటర్ ఎదుట నివసిస్తున్న జిల్లేళ్లమూడి భవాని ఇనుప కొట్టు పెట్టుకొని నివసిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు షేక్ కరీం అనే యువకుడితో 2022లో పరిచయమైంది. ఆమె షాపులో గుమాస్తాగా కొంతకాలం పని చేశాడు. తదనంతర పరిణామాలతో ఆమె ఈ ఏడాది ఫిబ్రవరిలో నరసరావుపేట రోడ్డులో ఫుడ్‌కోర్టు పెట్టారు. అతను ఆ షాపులో కొద్ది రోజులు పని చేసి మానేశాడు. అయితే వాళ్లిదరూ ఉన్న ఫొటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో పెడతానని బెదిరిస్తున్నాడని ఆమె ఫిర్యాదు చేసింది. కరీంపై అత్యాచారం, ఐటీ యాక్ట్ కింద పట్టణ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసరావుపేట డివిజన్

99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)

Office mail : sakshigntadvt@gmail.com